



కార్తికేయుడి సేవలో పీఆర్కే

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం దర్శించుకున్నారు.



8,004 క్యూసెక్కులు విడుదల

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 8,004, హై లెవల్ కాలువకు 330, బ్యాంక్ కెనాల్‌కు 1,807 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతలలో 45 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో గురువారం నీటి నిల్వ 45 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 29,850 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

వందశాతం వంచన

వంద రోజుల పాలనలో ఒక్క హామీనీ నెరవేర్చని సర్కారు

ఎన్నికల ముందు అంతన్నారు.. ఇంతన్నారు. అరచేతిలో స్వర్గం చూపించారు.. అన్నీ ఉచితమంటూ ఆశల పల్లకిలో ఊరేగించారు.. తీరా గెలిచాక హామీల అమలును అటకెక్కించారు.. ప్రజలను నిలువెల్లా ముంచేశారు. అలవికాని హామీలు కదా.. అని ప్రశ్నిస్తే సంపద సృష్టించి మరీ సంక్షేమం అమలు చేస్తామంటూ బీరాలు పలికారు.. తీరా నేడు భయమేస్తుందంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ప్రత్యేకించి జిల్లాకు ఎన్నికల ముందు కూటమి ముఖ్య నేతలు క్యూ కట్టి మరీ హామీల వర్షం కురిపించారు.. గద్దెనెక్కి వందరోజులవుతున్నా వాటిలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా చేతులెత్తేశారు.



- హామీల వర్షం.. అమలులో జాప్యం
- ఎన్నికల వేళ కూటమి నేతలు హామీలు
- అద్దంకిని ప్రకాశంలో కలిపేస్తాం
- రేపల్లెలో వందపడకల ఆసుపత్రి
- తీరప్రాంతంలో పర్యాటకాభివృద్ధి
- చివరి ఆయకట్టుకు నీళ్లిచ్చేలా కృష్ణా, సాగర్ కాలువల ఆధునికీకరణ
- అన్నినియోజకవర్గాల్లో తాగునీటి పథకాలు
- కుప్పలు తెప్పలుగా నేతల హామీలు
- అధికారంలోకి వచ్చాక ఒక్కటీ నెరవేర్చని వైనం



చీరాల ఎన్నికల సభలో హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు (ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: అధికారమే పరమావధిగా, అలవికాని హామీలు ఇచ్చి జనాన్ని మభ్యపెట్టి ఓట్లేయించుకున్న కూటమి నేతలు తీరా గద్దెనెక్కాక ఏరు దాటాక తెప్పతగలేసిన చందంగా వ్యవహరిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో మ్యానిఫెస్టోలో 66 హామీలు ఇచ్చిన కూటమి పార్టీలు ఇటు జిల్లా అభివృద్ధికి సంబంధించి సైతం పెద్ద ఎత్తున హామీలు గుప్పించారు. వందరోజుల పాలన ముగిసినా ఒక్క హామీనికూడా నెరవేర్చకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కూటమి నేతల వంచనపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలకు మంగళం..


ఎన్నికల ప్రచారం సందర్భంగా జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, లోకేష్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లు జిల్లా అభివృద్ధికి సంబంధించి పలు హామీలు ఇచ్చారు.

లోకేష్ హామీలు

- అద్దంకి నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతాం
- సింగరకొండ భవనాశి రిజర్వాయర్, కొరిశపాడు మండలంలోని ఎర్రంచినపోలిరెడ్డి ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరందిస్తాం
- అద్దంకి పట్టణంలో వైద్యశాలను వంద పడకలకు విస్తరిస్తాం

పవన్‌కల్యాణ్ హామీలు..

రేపల్లె ప్రాంతంతోపాటు బాపట్ల జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం. జూదకేంద్రంగా మారిన రేపల్లెలో పేకాట, ఇతర జూదాలను పూర్తిస్థాయిలో నియంత్రిస్తాం.



అద్దంకి పట్టణ వ్యూ


చంద్రబాబు హామీలు

- రేపల్లె ప్రభుత్వ వైద్యశాలను వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తా
- టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తాం
- రేపల్లెలో శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు
- కృష్ణా కరకట్టను పటిష్టం చేస్తాం
- నిజాంపట్నంను వ్యాన్‌పిక్ సిటీగా అభివృద్ధి చేసి మెగా సిటీగా రూపొందిస్తాం.
- చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తాం
- మత్స్యకారుల ఎగుమతులకు తోడ్పాటు అందిస్తాం
- చీరాలలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు.
- చీరాలలో ఐటీ టవర్ నిర్మాణం
- జిల్లాలోని తీరప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- బాపట్ల ప్రాంతంలో పూల మార్కెట్ అభివృద్ధికి కృషి
- అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆస్పత్రులు, తాగునీటి పథకాలు, డంపింగ్‌యార్డుల ఏర్పాటు
- జిల్లావ్యాప్తంగా రహదారుల అభివృద్ధి
- బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాల్లో చివరి ఆయకట్టుకు సాగునీటి తరలింపు, లిఫ్ట్ స్కీములు
- తీరంలో తుఫాను షెల్టర్ల నిర్మాణం



కొల్లూరు మండలంలో బలహీనంగా కృష్ణా కరకట్ట

సంపద సృష్టిస్తా అంటూ ప్రగల్భాలు



పూర్తిస్థాయిలో నీరందిస్తామంటూ లోకేష్ హామీ ఇచ్చిన కొరిశపాడు ఎత్తిపోతల పథకం

అధికారం అప్పగిస్తే సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని బీరాలు పలికిన చంద్రబాబు, కూటమి నేత లు, వారికి వంతపాడే పచ్చపత్రికలు ఇప్పుడు రాష్ట్రం అప్పుల్లో ఉందని, గత పాలకులు నాశనం చేశారంటూ సన్నాయి నొక్కులు నొక్కడం చూస్తే వారు మరోమారు జనాన్ని వంచించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ఓట్లేయించుకొని ఏరుదాటాక బోడిమల్లన్న చందంగా కూటమి ప్రభుత్వం వ్యవహరించడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



100 పడకల ఆస్పత్రిగా మారుస్తానని చంద్రబాబు హామీ ఇచ్చిన రేపల్లెలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్

సూపర్ సిక్స్‌కు మంగళం

ఎన్నికలముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కో రైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని కూటమి ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సివుండగా ఖరీఫ్ ముగుస్తున్నా ఇప్పటికి పైసా ఇవ్వలేదు.

- ఎన్నికల ముందు తల్లికి వందనం కింద ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తామన్నారు. జిల్లాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుటుంబానికి ఒక్కరు చొప్పున 1,16,019 మందికి రూ.174.02 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు కుటుంబానికి ఇద్దరు చొప్పున ఇచ్చినా రూ. 350 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. విద్యాసంవత్సరం మధ్యకొచ్చినా ఇప్పటికీ తల్లులపేర పైసా జమచేయలేదు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారు.
- డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షలు, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు అన్నారు.
- స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ. 5వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ, క్వారీల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్, రాయల్టీ, సీనరేజ్‌ల్లో మినహాయింపు, దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు నెలకు రూ. 25 వేల జీతం అన్నారు.
- రైతుకూలీలకు కార్పొరేషన్లు, 90 శాతం సబ్సిడీతో బిందుసేద్యం, ట్రాన్స్‌ఫార్మర్ల ధరల తగ్గింపు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రూ. 5 లక్షల వడ్డీలేని రుణాలు, ఆటో, ట్యాక్సీ, లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ. 15వేలు, డ్రైవర్లకు సాధికార సంస్థ ఏర్పాటు. ఇలా చెప్పుకుంటూ పోతే కూటమి మ్యానిఫెస్టో 66 హామీలు గుప్పించింది. కానీ ఇప్పటికి ఒక్కహామీ కూడా నెరవేర్చలేదు. ఇటు జిల్లా అభివృద్ధికి సంబంధించి ఇచ్చిన హామీలను సైతం పట్టించుకోలేదు.

న్యూస్‌రీల్

ఇది ప్రజలను ముంచిన ప్రభుత్వం



సత్తెనపల్లి: 'ఇది మంచి ప్రభుత్వం కాదు ... ప్రజలను ముంచిన ప్రభుత్వం' అని రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు గురువారం ట్వీట్ చేశారు. ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లేలా కార్యాచరణ రూపొందించి 100 రోజుల పాలనపై 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో టీడీపీ ప్రజల్లోకి వెళ్లనుంది. దీనిపై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎక్స్‌లో స్పందించారు. ''మాది మంచి ప్రభుత్వం అని వారం రోజులు సంబరాలు చేస్తాం అంటున్నారు.. ఎలా మీది మంచి ప్రభుత్వం? నీకు రూ.15 వేలు, నీకు రూ. 15 వేలు అని చెప్పి ఇవ్వకుండా మోసం చేసినందుకా మీది మంచి ప్రభుత్వం?'' అని ప్రశ్నించారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోయింది, మేం హాయిగా ఉన్నాం అని అనుకోవట్లేదు ... వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎందుకు దించేశామా అని పశ్చాత్తాప పడేలా కూటమి వంద రోజుల పాలన ఉందన్నారు. నాణ్యమైన మద్యం ఇస్తాం.. తాగండి అంటూ నారా వారి సారా పాలన అనేలా రాష్ట్రంలో పరిస్థితి ఉందని విమర్శించారు.

చుక్కల భూముల పునఃపరిశీలన



పెదకూరపాడు: నియోజకవర్గంలో ఫ్రీ హోల్డ్ చేసిన చుక్కల, అసైన్డ్ భూముల వివరాలను స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ ఆర్.కుమోదినీ సింగ్ గురువారం పునఃపరిశీలన నిర్వహించారు. వెంట డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, పెదకూరపాడు తహసీల్దార్ దానియేలు, శ్రీనివాసరావులు ఉన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 589.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 2,236, ఎడమ కాలువకు 4,613, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 28,866, ఎస్‌ఎల్‌బీసీకి 1,800, వరద కాలువకు 600 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 38,115 క్యూసెక్కులు వచ్చి చేరటంతో అంతే నీటిని విడుదల చేస్తున్నారు.

ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్‌ఓ సమావేశం



గుంటూరు మెడికల్: గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. కమిషనర్ ఆఫ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల ప్రకారం ప్రతి 3 నెలలకు ఒకసారి ఆశా కార్యకర్తలతో డీఎంహెచ్‌ఓలు సమావేశం నిర్వహించాలి. ఆ మేరకు ఏర్పాటైన సమావేశంలో వారి సమస్యలపై 12 అర్జీలను స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరిస్తానని, మిగతావి ఉన్నతాధికారులకు పంపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, చంద్రశేఖర్, సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

24 వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం అందించనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈనెల 24న ముగియనుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చూపిన వారికి 9,10,11,12వ తరగతుల్లో ఏడాదికి రూ.12వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యార్థులతో దరఖాస్తు చేయించాలని ఆమె సూచించారు.

ఖజానా ఉద్యోగులపై కొరడా

- ప్రభుత్వానికి చీరాల ఎస్టీఓ సరెండర్
- మిగిలిన ఉద్యోగులు దూరప్రాంతాలకు బదిలీ
- ఉత్తర్వులు వెల్లడించిన కలెక్టర్ వెంకటమురళి

సాక్షి ఎఫెక్ట్..

చీరాల: జిల్లాలోనే సంచలనంగా మారిన ఖజానా ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి కొరఢా ఝులిపించారు. అవినీతి, అక్రమ సంపాదనే ధ్యేయంగా పనిచేస్తు ఉద్యోగులు, కాంట్రాక్టర్లు, విశ్రాంత ఉద్యోగుల పాత బిల్లులు పాస్ చేయకుండా కుర్చీల కుమ్ములాట ఆడుతు, కాసులు రావని పెన్‌డౌన్ చేసిన చీరాల ఖజానా కార్యాలయంపై 'అవినీతి ఖజానా' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 18న కథనం ప్రచురితమైంది. పత్రికల్లో వచ్చిన కథనాలు, తనకు వచ్చిన నివేదికల ఆధారంగా కలెక్టర్ ఖజానా కార్యాలయ్యాన్ని ఖాళీ చేయించారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ వెంకటమురళి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకెళితే....చీరాల ఉపఖజానా కార్యాలయం ఉద్యోగులు తమకు కాసులు వచ్చే కుర్చీలు కేటాయించలేదని 272 వివిధ రకాల బిల్లులు ఆన్‌లైన్‌లో పాస్ చేయకపోవడం, కాసులు వచ్చే కుర్చీ తమకే ఇవ్వాలని కోరుతు టీడీపీ ముఖ్య నేత ద్వారా సిఫారసు లేఖను తెప్పించుకుని ఆఫీస్ ఆర్డర్‌ను సైతం పట్టించుకోకపోవడంతో మీడియాలో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ స్పందించి చీరాల ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి, ఖజానా డీడీతో విచారణ చేయించారు.



చీరాల ఖజానా ఉద్యోగుల తీరుపై సాక్షి ప్రచురించిన ప్రత్యేక కథనం

సుదూర ప్రాంతాలకు బదిలీలు..

ఈ విచారణలో కార్యాలయం ఉద్యోగులు పెండింగ్‌లో నిలిపిన వివిధ రకాల ఉద్యోగుల బిల్లులు, పింఛన్ దారుల పింఛన్లు, కాంట్రాక్టర్ల బిల్లులను 292 రకాలు బదిలీ చేయకపోగా ఆఫీసు ఆర్డర్‌ను పట్టించుకోకుండా విధులు నిర్వహించడంతో ఆర్డీఓ, డీడీలు తమ నివేదికలను కలెక్టర్‌కు అందించారు. బాపట్ల జిల్లాలో సంచలనంగా మారిన ఖజానా ఉద్యోగుల తీరుపై జిల్లా కలెక్టర్ తనదైన రీతిలో స్పందించి అక్రమాలను అడ్డుకోలేకపోయిన చీరాల ఎస్టీఓ భాగ్యలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అలానే కార్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిని ప్రకాశం జిల్లాలోని సుదూర ప్రాంతాలకు బదిలీ చేయాలని ఉత్తర్వులివ్వడంతో పాటుగా చీరాల ఖజానా కార్యాలయంలో నూతన ఉద్యోగులను నియమించనున్నారు. చీరాల ఉపఖజానా కార్యాలయం ఉద్యోగులు పనితీరుపై పలు విమర్శలు రావడం, విచారణలో నిజాలు తేలడం, ఉన్నతాధికారుల ఆదేశాలతో 272 బిల్లులు పాస్ చేయించడం, అక్రమాలకు పాల్పడుతున్న ఖజానా కార్యాలయం ఉద్యోగులు, అధికారులకు కలెక్టర్ వెంకటమురళి బదిలీ చేయడం జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో ప్రణాళికలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంతో అధికారులు ప్రణాళికలు రూపొందించి చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర జిల్లా విజన్ ప్లాన్ అక్టోబర్ 15వ తేదీనాటికి రూపొందించాలని కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. ఈనెల 30వ తేదీలోగా మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించి నివేదిక పంపాలని ఆదేశించారు. ఇదే క్రమంలో స్వర్ణాంధ్ర కోసం రానున్న ఐదేళ్లకు వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో మత్స్యసంపద వృద్ధిని ఉటంకిస్తూ ప్రణాళికలు ఉండాలని ఆయన పలు సూచనలు చేశారు. రూపొందించే విజన్ డాక్యుమెంట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అక్టోబర్ 15వ తేదీనాటికి జిల్లా స్థాయిలో డాక్యుమెంట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆక్వా, వ్యవసాయ, పర్యాటక రంగాలపై సమగ్ర ప్రణాళిక ఉండాలని సూచించారు. ఆక్వా సాగు, ఆక్వా పార్కు, ప్రాసెసింగ్ యూనిట్లు, బీచ్ టూరిజం, చేనేత పార్కు అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన వంటి అంశాలను ఇందులో జోడించాలన్నారు. పురుగు మందులు లేని వ్యవసాయ ఉత్పత్తుల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆ ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్‌ఓ సత్తిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యానికి గురైన జిల్లాగా బాపట్ల..

బాపట్ల జిల్లాను ప్రకృతి వైపరీత్యానికి గురైన జిల్లాగా గుర్తించి ఉపశమనం ప్రకటించారని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఒక ప్రకటనలో తెలియజేశారు. జీఓఎంఎస్ నెంబర్ 12 ప్రకారం రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ ఈనెల 18వ తేదీన బాపట్ల జిల్లాను ప్రకృతి వైపరీత్యానికి గురైన జిల్లాగా ప్రభుత్వం గుర్తించి 'ఉపశమనం' ప్రకటించిందని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో సంభవించిన వరదలు, భారీ వర్షాలతో తీవ్రంగా ప్రభావితమైన రాష్ట్రంలోని విజయనగరం, ఏఎస్ఆర్, కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలను ప్రకృతి వైపరీత్యాలకు గురైన జిల్లాలుగా ప్రభుత్వం గుర్తించి ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

నేటి నుంచి గ్రామసభలు..

బాపట్ల: గ్రామ సభలు 20 నుంచి 26వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. జిల్లా అధికారులు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి పరిపాలన అందిస్తున్న తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కలెక్టర్ చెప్పారు. ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించాలన్నారు.

టీడీపీ కార్యాలయానికి అధికారుల క్యూ

కర్లపాలెం టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే వేగేశన



ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే నరేంద్రవర్మతో పాటు పాల్గొన్న ఎంపీడీఓ, తహసీల్దార్ , అధికారులు

కర్లపాలెం: తెలుగుదేశం పార్టీ కర్లపాలెం మండల కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరుకావటం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రజా ప్రతినిధులు అధికారులు కలసి గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలు తీసుకునేవారు. అవసరం మేరకు ప్రజల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేవారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు అధికారులతో కలసి ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేవారు. అయితే కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కర్లపాలెం టీడీపీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం, అధికారులు స్వయంగా పార్టీ కార్యాలయానికి వచ్చి పాల్గొనడం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎలీషాబాబు, తహసీల్దార్ వెంకటరత్నం, మరికొందరు అధికారులు హాజరయ్యారు. టీడీపీ కార్యాలయంలో కార్యక్రమం జరగడంతో కొందరు ఆ పార్టీ నేతలు మాత్రమే హాజరై సమస్యలను విన్నవించారు. మండలంలోని ప్రజలకు ఎన్నో సమస్యలు ఉన్నా టీడీపీ ఆఫీస్‌కు వెళ్లలేక అర్జీలు ఇవ్వలేకపోయారు. దీనిపై ప్రజా దర్బారు టీడీపీ వారి కోసమా లేక జనం కోసమా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అక్రమాలకు పాల్పడిన ఆర్పీ అరెస్ట్

రేపల్లె రూరల్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఆర్పీగా పనిచేస్తూ పలు డ్వాక్రా గ్రూపులను మోసగించి అక్రమంగా రుణాలు పొందిన 21వ వార్డుకు చెందిన షేక్ ముంతాజ్‌బేగంను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముంతాజ్‌బేగం తమ పరిధిలోని గ్రూప్ సభ్యులకు తెలియకుండా పలు బ్యాంకుల్లో రుణాలు పొంది వ్యక్తిగతంగా వినియోగించుకున్నట్లు గ్రహించిన పలువురు గ్రూప్ సభ్యు లు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ గత ఏడాది ఫిర్యాదు చేశారన్నారు. కేసును విచారించి అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ కావటంతో ముంతాజ్‌బేగంను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. కేసులో బాధితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చట్టపరంగా న్యాయం చేస్తామని చెప్పారు.

సౌత్-సెంట్రల్ జోన్ మ్యాచ్ డ్రా

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలో సౌత్‌జోన్, సెంట్రల్‌జోన్ మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 481 పరుగులు చేయగా, ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్లు నష్టానికి 186 పరుగులతో గురువారం తొలి ఇన్నింగ్స్ ఆడుతున్న సెంట్రల్‌జోన్ 234 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులోని పి.అనంత్ కార్తికేయ 84, ఎం.లేఖజ్‌రెడ్డి 85 పరుగులు సాధించారు. సౌత్‌జోన్ బౌలర్లు షేక్.ఇస్మాయిల్ ఆరు వికెట్లు, ఆర్.ప్రకాష్‌రెడ్డి నాలుగు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్‌జోన్ ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్లు నష్టపోయి 364 పరుగులు చేసింది. జట్టులోని ఈ.ధరణికుమార్ 97 బంతుల్లో 92 పరుగులు, వై.తేజారెడ్డి 69 బంతుల్లో 63 పరుగులు సాధించారు. సెంట్రల్‌జోన్ బౌలర్ జీవీఎస్.సుమిత్ 4వికెట్లు సాధించారు. ఎంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యత చాటిన సౌత్‌జోన్‌కు 3 పాయింట్లు, సెంట్రల్‌జోన్‌కు ఒక పాయింట్ లభించాయి.

ఏం..కొనేటట్టు లేం..

- వరదల్లో నీటమునిగిన వాణిజ్యపంటలు
- అంతర పంటలుగా కూరగాయల సాగు
- రెండు పంటలూ వరదార్పణం
- మండిపోతున్న కూరగాయల ధరలు
- ఇప్పటికే పనులు లేక తిప్పలు..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న లంక గ్రామాల ప్రజలు

కూరగాయలు	కిలో ధర (రూ.)
వంకాయ	60
బెండ	50
దొండ	60
టమాటా	60
దోస	40
కాకర	50
చిక్కుళ్లు (పెద్దవి)	40
బీర	50
బంగాళదుంప	50
మిర్చి	40
క్యారెట్	70


వేమూరులో కూరగాయల అమ్మకాలు

వేమూరు: కృష్ణా నది వరదల వల్ల లంక గ్రామాల్లో వాణిజ్య పంటలు, కూరగాయల పంటలు నీట మునిగిపోవడంతో వాటి ఉత్పత్తి లేక, ధరలు మండిపోతున్నాయి. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని 24 లంక గ్రామాల్లో రైతులు, కౌలు రైతులు వాణిజ్య పంటల్లో అంతరపంటగా బెండ కాయ, దోస, వంకాయ, బీర, పొట్ల కాయ వంటి పంటలను సాగు చేశారు. వరదలకు వాణిజ్యపంటలతో సహా అంతరపంటలుగా వేసిన కూరగాయల పంటలు కూడా మునిగిపోయాయి. దీంతో కూరగాయల కొరత ఏర్పడి, వాటి ధరలకు రెక్కలు వచ్చాయి.

పనులు లేక పస్తులు..

వరదల వల్ల పంటలు మునిగిపోవడంతో వ్యవసాయ కూలీలు పనులు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూరగాయలు, నిత్యావసరాలు ధరలు పెరిగిపోవడంతో పనులు లేక, వాటిని కొనుగోలు చేసే శక్తిలేక పేద, మధ్యతరగతి కుటుంబాలు నలిగిపోతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పనులు ఏక పస్తులు ఉంటున్నామని వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

కూరగాయలు కొనుగోలు చేయలేక పోతున్నాం



కూరగాయలు ధరలు మండిపోతుండడంతో కొనుగోలు చేయడం కష్టంగా ఉంది. వరదలు వల్ల పంటలు దెబ్బతినడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఏ కాయగూర కొనుగోలు చేద్దామన్నా.. అన్నీ ధరలు పెరిగిపోయాయి. తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వమే చర్యలు తీసుకుని ధరలు తగ్గించాలి.

– పమిడి పాగులు జ్యోతి, చంపాడు

తక్కువ ధరకు అందించాలి



కూరగాయల ధరలు పెరిగి పోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ సమయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని కూరగాయలను తక్కువ ధరకు అందించాలి. లేదంటే పేదలు బతకడం కష్టమవుతుంది.

– గొరిక పూడి ఉషా రాణి, పెనుమర్రు

ఎస్సీ ఎస్టీ కేసుల్లో రిలీఫ్ నిధులు విడుదల చేయని సర్కారు

దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు


ఎస్సీ,ఎస్టీ కేసుల్లో రిలీఫ్ నిధుల విడుదలపై కరపత్రం ఆవిష్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

బాపట్ల: నీరు–చెట్టు కాంట్రాక్టర్లకు, పంచాయతీలకు, అమరావతి రైతులకు నిధులిచ్చిన చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలకు రిలీఫ్ నిధులు ఇచ్చేందుకు మనసు రావడంలేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం బాపట్ల వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 100 రోజుల పాలనకే మంచి ప్రభుత్వం అని జబ్బలు చరుచుకుంటున్న కూటమి నేతలు ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ నిధులు విడుదల జాప్యంపై సమాధానం చెప్పాలన్నారు. వంద రోజులుగా కూటమి ప్రభుత్వం దళితుల సంక్షేమం మరచిందన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రధాన అంశమైన సూపర్ సిక్స్‌లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత లేదా అని నాగేంద్రరావు ప్రశ్నించారు. కూటమిలోని పార్టీలకు దళిత సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేనందువల్లే రిలీఫ్ బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బిల్లుల్ని చెల్లించేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధుల్ని బాధితులకు ఇవ్వటం లేదన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం కావలసిన జిల్లా, రాష్ట్రస్థాయి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరీ కమిటీల ఏర్పాటును కూడా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్నికల కారణంగా ఆరు నెలలు, కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనూ ఎస్సీ ఎస్టీ రిలీఫ్ బిల్లులకు విడుదల లభించలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెండింగ్ ఎస్సీ ఎస్టీ బిల్లులను వెంటనే చెల్లించేందుకు ఆదేశాలు జారీ చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఆయనవెంట మాల మహానాడు అధ్యక్షుడు దారా అంజయ్య, స్థానిక బీఎస్పీ నాయకులు కాగిత కోటేశ్వరరావు, రేగులగడ్డ చంద్రశేఖర్, గుదే రాజారావు, దారా బాబురావు తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక


విద్యార్థి లోకేష్ మారుతీ బ్రహ్మారెడ్డి

చెరుకుపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ టోర్నమెంట్‌లో మండలంలోని కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి అక్కల లోకేష్ మారుతీ బ్రహ్మారెడ్డి ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వనజాక్షి తెలిపారు. స్థానిక పాఠశాలలో విద్యార్థి అక్కల లోకేష్ మారుతి బ్రహ్మారెడ్డికి గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 5వతేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటాడని పేర్కొన్నారు. విద్యార్థి జాతీయస్థాయి పోటీలలో రాణించి పాఠశాల పేరును జాతీయస్థాయిలో ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. విద్యార్థి ప్రతిభ కనపరచటానికి కృషి చేసిన పీఈటీ పి.ప్రమీలను అభినందించారు. అదేవిధంగా పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ పుష్పలత, ఎ.చిరంజీవి, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ కాట్రగడ్డ అరవింద కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన


జీజీహెచ్ వద్ద వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

- కళ్లు, చెవులు, నోరు మూసుకుని వినూత్న నిరసన
- 15 వరోజుకు చేరుకున్న నిరసన కార్యక్రమాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు గురువారం చెవులు, కళ్లు, నోరు మూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకుండా కళ్లు మూసుకుంటుందని, తమ సమస్యలపై నోరు మెదపడం లేదని, కనీసం వినడం లేదంటూ వాపోతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జిలు ధరించి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసేవరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు తెలిపారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర నాయకులు పి.మనీష, స్వచ్ఛంద ప్రసాద్, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరు వాసికి ఇండియన్ ఐకాన్ అవార్డు

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన జడా సురేష్‌బాబు ఢిల్లీలో గురువారం జరిగిన గ్లోబల్ ఎక్సలెన్సీ ఆధ్వర్యంలో ఇండియన్ ఐకాన్ అవార్డ్–2024ను అందుకున్నారు. పార్లమెంట్ సభ్యుడు రబీంద్ర నారాయణ్ బెహరా, ఆర్ఎస్ఎస్ ఆర్గనైజేషన్ నేషనల్ ఎగ్జిక్యూటివ్ ఇంద్రేష్ కుమార్‌జీ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్, తెలంగాణ స్టేట్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామచంద్ర, కేరళ డీజీపీ సంజీవ పత్ జోషి, ఏపీ స్టేట్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జితేంద్రకుమార్‌లు పాల్గొన్నారు. సురేష్‌బాబు వెంట సూరేపల్లి గ్రామ ఉపసర్పంచ్ జంగం వాసు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి



చీరాల: విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చీరాల రూరల్ మండలం రామకృష్ణాపురంలో చోటు చేసుకుంది. కారంచేడు మండలం దగ్గుబాడుకు చెందిన గంగుపాటి సుమంత్ (20) గురువారం రామకృష్ణాపురంలోని బొడ్డురాయి దగ్గర శ్రీహరిషాప్ వద్ద కరెంట్ స్తంభం ఎక్కి స్ట్రీట్ లైట్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కిందపడిపోయాడు. వెంటనే వైద్యం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

నరసరావుపేటటౌన్: మొబైల్ దుకాణంలో రూ.3 లక్షల విలువైన సెల్‌ఫోన్‌లు చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగు చూసింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్ సుభాని, ఆర్టీసీ బస్‌స్టాండ్ ఎదుటగల వ్యవసాయ మార్కెట్ యార్డు దుకాణ సముదాయంలోని ఓ దుకాణంలో తాజ్ మొబైల్ పేరిట సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే బుధవారం రాత్రి దుకాణం మూసివేసి వెళ్లాడు. ఉదయం వచ్చి తాళాలు తెరవగా దుకాణంలో నూతన సెల్‌ఫోన్‌లు అపహరణకు గురయ్యాయి. దీంతో పాటు రిపేర్‌కు వచ్చిన సెల్‌ఫోన్‌లు సైతం కనిపించలేదు. దుకాణం పైభాగంలోని ఇనుపరేకులను తొలగించి దుండగుడు లోనికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్ఐ అశోక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ భృతికి దరఖాస్తు చేసుకోవాలి

పట్నంబజారు: వేద విద్యను అభ్యసించి ఖాళీగా ఉంటున్న నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న క్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగులుగా ఉన్న వేద విద్యార్థులకు రూ. 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వేద విద్యార్థులు వారం రోజుల లోపు దేవదాయ శాఖ సహాయ కమిషనర్, డెప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో వారు వేదం అభ్యసించిన సర్టిఫికెట్లు, వ్యక్తిగత వివరాలను తెలియజేస్తూ అర్జీలు అందించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 9701674999 నంబరులో సంప్రదించాలన్నారు.

నవంబర్‌లో ఐఎంఏ రాష్ట్ర సదస్సు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎంఏ నేతలు

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర వార్షిక సదస్సుకు ఈ ఏడాది గుంటూరు నగరం వేదిక కానుంది. బ్రోచర్‌ను గుంటూరు జీఎంఏ హాల్లో గురువారం గుంటూరు వైద్యులు ఆవిష్కరించారు. నవంబర్ 22, 23, 24 తేదీల్లో గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నందకిశోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ తాతా సేవకుమార్ తెలిపారు. సదస్సుకు కో చైర్మన్‌గా డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ బూసిరెడ్డి నరేందర్‌రెడ్డి, కో సెక్రటరీగా డాక్టర్ వి. మహేష్, కన్వీనర్‌గా డాక్టర్ ఎస్. ఉమాశంకర్, కోశాధికారిగా డాక్టర్ బి. సాయి కృష్ణ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలిపారు. కమిటీల చైర్మన్లుగా డాక్టర్ ఎస్. అమర్నాథ్ ,డాక్టర్ సీహెచ్. విశ్వేశ్వరరావు, డాక్టర్ ఎం. ఫణి కుమార్, డాక్టర్ జి. వేణుగోపాల్, డాక్టర్ టి. వాసు కిశోర్, డాక్టర్ ఎం.జగదీష్ కుమార్, డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, డాక్టర్ వి.వి రామ కుమార్, డాక్టర్ బి.బి అప్పారావు, మహిళా విభాగానికి డాక్టర్ పి.ఎస్.ఎస్. హరిత వివిధ కమిటీలకు సంధానకర్తలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సదస్సుకు అతిథులుగా ఐఎంఏ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్.వి.అశోకన్, కార్యదర్శి, డాక్టర్ అనిల్ కుమార్ జే నాయక్ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.జె.సి. నాయుడు, కార్యదర్శి డాక్టర్ పి.ఫణిధర్ , ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ జి. సమరం తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని వైద్యులు అధిక సంఖ్యలో ఈ సదస్సుకు హాజరుకావాలని డాక్టర్ నందకిశోర్, డాక్టర్ సేవ కుమార్ కోరారు. మరిన్ని వివరాలకు 7569702090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పొంతనలేని ప్రశ్నలతో విచారణ

విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని విచారించిన మంగళగిరి పోలీసులు


శ్రీనివాస్‌రెడ్డిని విచారణకు తీసుకు వస్తున్న పోలీసులు

మంగళగిరి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో అక్రమంగా అరెస్ట్ అయి జైలులో ఉన్న విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాస్‌రెడ్డిని గురువారం మంగళగిరి రూరల్ స్టేషన్‌కు తరలించి విచారించారు. విచారణలో పోలీసులు శ్రీనివాస్‌రెడ్డిని సంఘటనతో సంబంధం లేని ప్రశ్నలతో విచారించి వైఎస్సార్ సీపీ పెద్దల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. పోలీసుల విచారణకు సహకరించిన శ్రీనివాస్‌రెడ్డిని తిరిగి జైలుకు తరలించారు. ఉదయం 8 గంటలకు విచారణ ప్రారంభించిన అధికారులు 12 గంటకు కోర్టులో హాజరు పరచి సాయంత్రం 4 గంటలకు గుంటూరు కారాగారానికి తరలించారు.

అనుమతులు లేకుండా నడిరోడ్డుపై జన్మదిన వేడుకలు

- అరండల్‌పేట స్టేషన్‌కు కూతవేటు దూరంలో నిర్వహణ
- నిలిచిపోయిన ట్రాఫిక్
- అధిక సంఖ్యలో పాల్గొన్న యువత
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్‌కు తరలింపు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో శారదా కాలనీ, రత్నపురి కాలనీ ప్రాంతాలలో ఇద్దరు యువకులు జన్మదినం ఒకే రోజు కావడంతో వేడుకలను నడిరోడ్డుపై నిర్వహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అనుమతి లేకుండా జరుపుకుంటున్న నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం తెలియడంతో అరండల్‌పేట స్టేషన్‌కు తరలించిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో శారదా కాలనీ 1వ లైన్‌లో ఒక యువకుడు, మల్లికార్జునపేటలో మరో యువకుడి ఇద్దరి జన్మదినం ఒకే రోజు కావడంతో రెండు ప్రాంతాలలో రోడ్డుకు అడ్డంగా వారి సన్నిహితులు, అనుయాయులతో జన్మదిన వేడుకల్ని నిర్వహించారు. డీజేలతో పాటు నడిరోడ్డుపై ట్రాఫిక్‌కు పూర్తి అంతరాయం కలిగించడంతో నివాసితులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు అరండల్‌పేట సీఐ, సిబ్బందితో హుటాహుటిన సంబంధిత ప్రాంతానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. అనుమతులు లేకుండా జన్మదిన వేడుకల్ని జరుపుకుంటున్న వారిలో కొంత మంది యువకుల్ని వ్యాన్‌లో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా పదోన్నతి


ఆర్‌డీ కార్యాలయంలో ఫార్మాసిస్ట్‌లకు పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్‌డీ సుచిత్ర

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ –2 ఫార్మాసిస్టులకు ఆరుగురికి పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించి సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఉత్తర్వులను ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర గురువారం అభ్యర్థులకు అందజేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న ఆర్.మణికి నెల్లూరు జిల్లాలోని డీఎస్ఆర్ గవర్నమెంట్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఆర్.అన్నమ్మకు గుంటూరు జీజీహెచ్‌లో, నెల్లూరులో పనిచేస్తున్న ఎం.కృష్ణప్రియకు నెల్లూరు గవర్నమెంట్ కాలేజీలో సీనియర్ ఆఫీసర్స్‌గా ప్రమోషన్ ఇచ్చారు. గుంటూరు జిల్లా ముట్లూరులో పనిచేస్తున్న షేక్ కరిముల్లాకు గుంటూరు మెడికల్ కాలేజీలో, మంగళగిరిలో పనిచేస్తున్న ఎస్.కవితకు ఒంగోలు గవర్నమెంట్ హాస్పటల్‌లో, బాపట్ల జిల్లా మోపర్రులో పనిచేస్తున్న హుల్దా రాణికి మార్కాపురం గవర్నమెంట్ జనరల్ హాస్పటల్‌లో ఫార్మసీ ఆఫీసర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. కౌన్సిలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటు డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు షేక్ నాగూర్ షరీఫ్, గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బి.శ్యామ్‌లు పాల్గొన్నారు.

ఇల్లు కూలి వృద్ధురాలి మృతి


సూరమ్మ మృతదేహం

పట్నంబజారు: ఇల్లు కూలి వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్.అగ్రహారం ప్రధాన రహదారిలో అడపా సూరమ్మ (83), కుమారుడు శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన పెంకుటిల్లులో నివాసం ఉంటున్నారు. గురువారం ప్రమాదవశాత్తు కూలింది. ఇంటి శిథిలాల కింద సూరమ్మ, శ్రీనివాసరావు కిందపడ్డారు. స్థానికులు వెంటనే 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూరమ్మ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో సీఎస్ డీటీ పద్మజ

ప్రత్తిపాడు: అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని ఓ పత్తి గోడౌన్‌లో అక్రమంగా రేషన్ బియ్యంను దాచి ఉంచారన్న సమాచారం సివిల్ సప్లయీస్ అధికారులకు అందింది. దీంతో గురువారం సీఎస్ డీటీ పద్మజ స్థానిక అధికారులతో కలిసి గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. 120 బ్యాగుల్లో నిల్వ చేసిన 60 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. దీంతో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గోడౌన్‌ను అద్దెకు తీసుకున్న గుంటూరుకు చెందిన కె. జనార్ధన్‌పై 6–ఏ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఎస్ డీటీ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినా, విక్రయించినా, తరలించిన ఉపేక్షించబోమని పద్మజ హెచ్చరించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించాలి

- జిల్లా పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారి సురేఖ
- ఫణిదం పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం


మాట్లాడుతున్న జిల్లా పబ్లిక్‌హెల్త్ నర్సింగ్ అధికారి సురేఖ

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించాలని జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి సురేఖ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి సచివాలయ పరిధిలో మాతా శిశు సంరక్షణ సేవలు, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ సేవలు పరిశీలించేందుకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం గురువారం ఫణిదం పీహెచ్‌సీని సందర్శించింది. గర్భిణులకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వారిని ప్రతి నెలా ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేసి జబ్బులు రాకుండా చూడాల్సిన బాధ్యత ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు జరిగితే తల్లి,బిడ్డ క్షేమంగా ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సహకాలు కూడా లభ్యమవుతాయని ప్రోత్సహించాలన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందంలో జిల్లా స్టాటిస్టికల్ అధికారి నీలకంఠేశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారి ఉన్నూరు బాషా, పీహెచ్‌సీ కమ్యూనిటీ అధికారి జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య విస్తరణాధి కారి పిట్టల శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సీహెచ్‌ఓలు ఉన్నారు.